క్లుప్తంగా

సొంతగూటికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



అమరావతి: ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన అమరావతికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు.. గ్రామ ఉప సర్పంచి నిమ్మా విజయసాగరబాబు ఆధ్వర్యంలో సొంతగూటికి చేరారు. సోమవారం రాత్రి స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు నంబూరు బాబురావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విజయసాగర బాబు మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలను టీడీపీ నేతలు మభ్యపెట్టి, పార్టీలో చేర్చుకున్నప్పటికీ నిజం తెలుసుకొని వారు తిరిగి రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామానికి చెందిన ఆకుల సదా శివరావు, దుద్యాల గోపీ, చిన్న, నరేష్, రామిశెట్టి తేజ, సాయి, కోటా ప్రసాదు, పామర్తి మురళీతో పాటు 30 మందికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

16 మంది వలంటీర్ల రాజీనామా



సత్తెనపల్లి: నిస్సహాయులకు ఆసరాగా నిలిచి, స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న తమకు రాజకీయాలను ఆపాదించి, నిందలు వేయడం బాధాకరమని సత్తెనపల్లి పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలోని 25, 26 వార్డులకు చెందిన వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మనస్తాపం చెందిన తాము మూకుమ్మడిగా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. మొత్తం 16 మంది తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి మంగళవారం అందజేశారు. సెల్‌ఫోన్‌లను స్వాధీన పరిచారు. ఇప్పుడు తమపై ఎలాంటి విమర్శలు చేసే అవకాశం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి అంబటి విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

నేటి నుంచి పింఛను పంపిణీ

ముప్పాళ్ళ: మండలంలోని గ్రామ సచివాలయాల్లో బుధవారం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతుందని తహసీల్దారు పి.సింగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు మూడు రోజులు పాటు ఉదయం 6 నుంచి 11 గంటలు, సాయంత్రం 4 నుంచి 9గంటల వరకు సచివాలయ సిబ్బంది పింఛను నగదు ఇస్తారని పేర్కొన్నారు. పింఛనుదారులు ఆధార్‌కార్డు మాత్రమే తీసుకొని సచివాలయానికి రావాలని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వచ్చి సచివాలయ సిబ్బంది పింఛను అందజేస్తారని పేర్కొన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు: సామాజిక పింఛన్లు బుధవారం నుంచి పంపిణీ చేయున్నట్లు ఎంపీడీవో కేవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 8855 మంది లబ్ధిదారులకు రూ.2,64,23,500లు విడుదలైనట్లు పేర్కొన్నారు. పింఛనుదారులు సచివాలయానికి వెళ్లి పింఛను నగదు తీసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యే నంబూరుకు జన నీరాజనం

- ఎన్నికల ప్రచారంలో కుటుంబ సభ్యులు
- ప్రజలతో మమేకం, సంక్షేమంపై పూర్తిస్థాయి అవగాహన



గిరిజన తండా వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: గ్రామాలు సస్యశ్యామలంగా ఉండాలన్నా, సజావుగా సంక్షేమాభివృద్ధి జరగాలన్నా ఫ్యాను గుర్తుపై ఓటువేసి జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లి తండా, కంచుబోడు తండా, మాదిపాడు, గింజుపల్లి, గింజుపల్లి తండాల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం రాత్రి 10 గంటల వరకు ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయ ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణా నాయక్, ఎంపీటీసీ రమేష్ నాయక్, సర్పంచ్ మాదా వెంకట్రావు, కరిముల్లా, దావీదు, శ్రీనివాసరావు, వెంకట్రామయ్య ఉన్నారు.

మేలు చేసేవారినే ఎన్నుకోండి..

ఎవరైతే ప్రజలకు మేలు చేస్తారో... వారి కష్ట సుఖాలు తెలుసుకుని పాలన కొనసాగిస్తారో.. ఎవరైతే వివక్షత లేని సంక్షేమాభివృద్ధి అందిస్తారో.. వారినే ఎన్నుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంతకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో ఆమె తన కోడలు శ్రీవల్లి, కుమార్తె తులసీరామ్‌తో కలసి సోమవారం రాత్రి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. అచ్చంపేట మెయిన్‌రోడ్డు, చామ్రరోడ్డు, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్సీ, బీసీ, ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. మైనార్టీలతో మమేకమయ్యారు. గత ఐదేళ్లలో నియోజకవర్గంలో ఏమేరకు అభివృద్ధి జరిగింది, గత టీడీపీ ప్రభుత్వంలో ఎంత అభివృద్ధి జరిగింది అనే విషయాన్ని బేరుజు వేసుకోవాలని స్థానికులను కోరారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ఎమ్మెల్యే శంకరరావు నిలబెట్టుకున్నారన్నారు. నిరుపేదలందరికి ఇంటి స్థలాలు, గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధిని ఒక్కసారి గమనించాలన్నారు. సామాన్యులు పిల్లలు కూడా ఇంగ్లీష్ మీడియం చదివే అవకాశాన్ని కల్పించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, శంకరన్నను అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని వసంతమారి కోరారు. ఆమె వెంట సర్పంచ్ షేక్ జాని, పార్టీ పట్టణ కన్వీనర్ సమరం, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, మల్లికార్జునరావు, రామిశెట్టి చిన్న యల్లమందయ్య, సుంకర శ్రీనివాసరెడ్డి, పూల వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, కోగంటివారిపాలెం సర్పంచ్ నాగిరెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గెలుపు కోసం..

పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను మళ్లీ ఎగురవేయాలని, గతం కన్నా అత్యధిక మెజార్టీ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గ్రామ గ్రామాన ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. జన నీరాజనాలు అందుకుంటున్నారు. ఎమ్మెల్యే విజయం కోసం ఇప్పటికే ఆయన సతీమణి నంబూరు వసంతకుమారి, కుమారుడు నంబూరు కల్యాణ చక్రవర్తి విస్తృతంగా పర్యటిస్తూ.. గ్రామీణ ప్రజలతో మమేకమవుతున్నారు. ఆత్మీయ పలకరింపులతో ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్యే కోడలు నంబూరు శ్రీవల్లి, కుమార్తె తులసీరామ్ కూడా ఇంటింటికి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే నంబూరు గెలుపు కోసం అహర్నిశలు కృషిచేస్తున్నారు.



అచ్చంపేటలో ఎమ్మెల్యే కుమార్తె తులసీరామ్, కోడలు శ్రీవల్లి, సతీమణి వసంతకుమారి ప్రచారం

కట్టావారిపాలెంను దత్తత తీసుకుంటున్నా

- రూ.1.60 కోట్లతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కట్టావారిపాలెం గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం ప్రకటించారు. పట్టణం నుంచి కట్టావారిపాలెం గ్రామం వరకు ఆయన ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్థానిక నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి అంబటి మాట్లాడారు. గ్రామంలో తాము నమ్మిన వ్యక్తి గ్రామస్తులను, తమను మోసం చేసి వెళ్లిపోయినా.. ఆయన వెంట వెళ్లకుండా గ్రామస్తులంతా తనను ఆశీర్వదించారన్నారు. గతంలో ఎక్కువసార్లు ఈ ఊరికి రాలేక పోయానని, భవిష్యత్తులో ఇది పునరావృతం కాకుండా తరచూ గ్రామాన్ని సందర్శిస్తానన్నారు. ఏ అవసరం వచ్చినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే.. అందుబాటులో ఉంటానన్నారు. 12 వందల ఓట్లు ఉన్న ఈ చిన్న గ్రామంలో గత ఐదేళ్లలో రూ.1.60 కోట్ల అభివృద్ధి పనులు చేశామని మంత్రి చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ముందుగా గ్రామ ప్రజలు మంత్రి రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు నేతృత్వంలో సాగిన ప్రచారంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయ భాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, మండల నాయకులు జంగా చంద్రశేఖరరెడ్డి, మందాల శంకరారెడ్డి, మాజీ సర్పంచ్ చావల ఓకులేశ్వరరావు, నాయకులు దేవినేని నాగేశ్వరరావు, తూమాటి సాంబశివరావు, గోనె గుంట్ల రమేష్ పాల్గొన్నారు.

6న వడ్డెరల ఆత్మీయ సదస్సు

సత్తెనపల్లి గడ్డ ఎత్తిన సత్తెన్న విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేసి, చరిత్రలో నిలిచి పోయేలా వడ్డెరలకు ఆత్మగౌరవాన్ని అందించామని, వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపు నిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన వడ్డెరల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 6న నియోజకవర్గస్థాయి వడ్డెరల ఆత్మీయ సదస్సు నిర్వహించనున్నామన్నారు. ముఖ్య అతిథులుగా నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఏసురత్నం, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ళ రేవతి, ఇతర ముఖ్య నేతలను ఆహ్వానిద్దామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉపేష్, వడ్డెర పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ళ వెంకట్, న్యాయవాది చెంబేటి శివరామకృష్ణ, వడ్డెర సంఘం పట్టణ అధ్యక్షుడు వేముల వరప్రసాదరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లపు అంకమ్మరావు, ఉపాధ్యక్షుడు మల్లెల పాపారావు, ఒంటిపులి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ చల్లా ఆంజనేయులు, ట్రెజరర్ మన్నెం వెంకటేశ్వర్లు, మండల యూత్ ప్రెసిడెంట్ కొమెర శివశంకర్, కాంట్రాక్టర్ చల్లా శ్రీనివాసరావు, సంఘ నాయకులు ఒంటిపులి దానయ్య, వేముల కోటేశ్వరరావు, బత్తుల అంకమ్మరావు పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు



సత్తెనపల్లి కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



రుద్రవరంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ హజరత్తయ్య

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, వడ్డవల్లి, గచ్చిబౌలి సెంటరు, నాగన్న కుంట, శాలివాహననగర్‌లో స్థానిక పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతలకు ఏమాత్రం విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, ఏఎస్ఐ సుబ్బారావు కవాతులో పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం, రుద్రవరం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో స్థానిక పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో వారు సమావేశమయ్యారు. ఎస్సై పి.హజరతయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు సిబ్బందికి సహకరించాలన్నారు. ఏఎస్సై ఇమామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎస్ఐ షేక్ జాన్‌సైదా

క్రోసూరు: తూనికల కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ టి.షాలెంరాజు ఆదేశాల మేరకు మండలంలోని దొడ్లేరు, కొండూరు, గుడిపాడు, 88 త్యాళ్లూరు, క్రోసూరు గ్రామాల్లోని వ్యాపార సంస్థలు, ఎండీయూ వాహనాలను మంగళవారం తనిఖీ చేసినట్లు సత్తెనపల్లి తూనికల కొలతల శాఖ అధికారి షేక్ జాన్‌సైదా తెలిపారు. పలు కిరాణా దుకాణాల్లో బియ్యం టిక్కీలు(25 కిలోల ముద్ర) ఉండగా 24 కిలోలు బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. కూల్‌డ్రింక్‌లు అధిక ధరలకు విక్రయించటం, ఎండీయూ వాహనాల ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యం తూనికలో అవతవకలున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటికి సంబంధించిన ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా తూనికల్లో తేడాలు గుర్తించినా, అధిక ధరలకు విక్రయించినా 98851 27512 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

వైఎస్సార్ సీపీలో న్యాయవాది జిలాని చేరిక



సత్తెనపల్లి: నకరికల్లు మండలానికి చెందిన ప్రముఖ న్యాయవాది షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆయనను సాదరంగా ఆహ్వానించి, పార్టీ కండువా కప్పారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీలో న్యాయవాదులకు సముచిత స్థానం ఉంటుందని, బాధ్యతాయుతంగా పది మందిని చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. నకరికల్లు మండల పార్టీ అధ్యక్షుడు భవనం రాఘవరెడ్డి, ఎంపీటీసీ బాష తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బెల్లంకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలవ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేస్తున్నారు. బెల్లంకొండ, మాచాయపాలెం క్రాస్ రోడ్ల వద్ద మంగళవారం తెల్లవారుజాము నుంచి తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ.. పెద్ద మొత్తంలో నగదు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి రోజూ వాహనాల తనిఖీ చేస్తామన్నారు. ఏఎస్ఐ మునలారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్ సీపీలో చేరికలు



కొండూరు నుంచి పార్టీలో చేరినవారితో..



మాదిపాడు నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: మండలంలోని కొండూరులో మంగళవారం ఎస్టీ కులానికి చెందిన అనేకమంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానం పలికారు. కుంభా పెద్ద రామకోటి, కుంభా నాగరాజు, కుంభా శ్రీను, కుంభా గోపీ, కుంభా వెంకయ్య, కుంభా రామాంజనేయులు, కె.శ్రీను, కె.మాస్ తదితరులు పార్టీలో చేరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, బీసీ నాయకులు చొప్పరపు రామయ్య, సర్పంచ్ రామాంజనేయులు, రంగా, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ సాగనబోయిన వెంకాయమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యాంపాంగు కిట్టయ్య, రుద్రపోగు రాంబాబు సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు.

– మాదిపాడు గ్రామానికి చెందిన పది టీడీపీ మద్దతుదారులైన టీడీపీ కుటుంబాల సభ్యులు సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు.



పెదకూరపాడు టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు..

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. యాంపొంగు వెంకటేశ్వర్లు, కిట్టారావు, బాలస్వామి, నాగేశ్వరరావు, నాగరాజు, ప్రేమమ్మ, మేరి పార్టీలో చేరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

పెదకూరపాడు: మండల కేంద్రానికి టీడీపీ నేతలు చెరుకూరి రాజేష్, బండారు నాగరాజు(మణికంఠ) మంగళవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి నంబూరు శంకరరావు పార్టీ కండువాలు సాదరంగా ఆహ్వానించారు. క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాసం.. పరమ పవిత్రం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



భోజనం వడ్డిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాసం నిర్దిష్ట నియమాలతో కూడుకున్న జీవన విధానమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం పట్టణంలో గుంటూరు మేస్త్రీ షేక్ జానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి కార్యకర్తనూ పలకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. ధూళిపాళ్ల మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. నమాజ్ చేశారు. అందరినీ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

నియోజకవర్గ స్థాయిలో ఇఫ్తార్ విందు..

సత్తెనపల్లి పట్టణంలోని మాచర్ల రోడ్డులో ఉన్న ఈద్గా మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం ముస్లిం సోదరులకు నియోజకవర్గస్థాయిలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నారు. ఈద్గా స్థలంలో ఏర్పాట్లను మంత్రి స్థానిక నాయకులతో పర్యవేక్షించారు. పక్కాల సూరిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, షేక్ మహ్మద్ గని, నాగుల్‌బాష ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా పమిడి నాగేశ్వరరావు



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన పమిడి నాగేశ్వరరావును ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల మంగళవారం ప్రకటించారు. పమిడి నాగేశ్వరరావు 2019 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.



సత్తెనపల్లిలో రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

ఒకటో తేదీ రాగానే సూర్యోదయానికి ముందే వలంటీర్లు ఇంటి తలుపు తట్టి పింఛను చేతిలో పెడుతుండడంతో మురిసిపోయారు. టీడీపీ హయాంలో కార్యాలయాలు చుట్టూ తిరిగే బాధలు తొలగిపోయాయని సంబరపడ్డారు. అయితే టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపుతూ వలంటీర్ వ్యవస్థపై తన అక్కసును వెళ్లగక్కారు. తన అనుకూల వర్గంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ అడ్డుకున్నారు. ఈ నెల పింఛన్ సొమ్ము కోసం ఎదురుచూసిన పండుటాకులకు తీవ్ర నిరాశే ఎదురైంది. తాము సంతోషంగా ఉండడం చంద్రబాబుకు ఇష్టం లేదంటూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే వలంటీర్లను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుండడంతో మనస్థాపానికి గురైన వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడుతున్నారు.

వలంటీర్లపై కోపం.. పింఛనుదారులకు శాపం

- గతంలోలా ఆపసోపాలు పడలేమంటున్న వృద్ధులు
- టీడీపీ, జనసేన, బీజేపీ తీరుపై మండిపాటు
- రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతామంటున్న పింఛనుదారులు
- చంద్రబాబు తీరుతో మనస్థాపం చెంది 16 మంది వలంటీర్లు రాజీనామా
- నియోజకవర్గంలో 40,520 మంది పింఛనుదారులు

నియోజకవర్గంలో 40,520 మంది లబ్ధి దారులు

సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 40,520 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెల ప్రభుత్వం రూ.12,06,30,500లు పెన్షన్ల రూపంలో వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తోంది. అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఇలా... పెన్షన్ దారులకు రూ.3 వేలు, డయాలసిస్ రోగులకు రూ. 10 వేలు, డీఎంహెచ్ఓ కేటగిరీలో లబ్ధిదారులకు రూ. 5 వేలు చొప్పున పింఛను అందజేస్తున్నారు. వీరంతా ఈ రెండు నెలల పాటు పింఛను తీసుకునేందుకు కష్టాలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లపాటు ఇంటి వద్దనే ఉంటూ పెన్షన్ తీసుకోగా, తాజా ఉత్తర్వుల మేరకు సమీపంలోని సచివాలయాలకు వెళ్లి పింఛను తీసుకోవాలి.

నియోజకవర్గంలో సచివాయాలు, పింఛనుదారులు ఇలా..

మండలం	సచివాలయాలు	పింఛన్లు	నగదు (రూ.ల్లో)
సత్తెనపల్లి టౌన్	15	6,397	1,92,08,000
సత్తెనపల్లి రూరల్	19	10,989	3,26,48,000
ముప్పాళ్ళ	13	6,297	1,86,16,000
రాజుపాలెం	14	7,117	2,12,75,500
నకరికల్లు	14	9,720	2,88,83,000
మొత్తం	75	40,520	12,06,30,500

సత్తెనపల్లి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి వలంటీర్లను చూస్తే .. సీఎం జగన్ మోహన్ రెడ్డి గుర్తుకు రావడంతో వారిపై తీవ్ర అసహనం పెరిగిపోయింది. ఎలాగైనా వలంటీర్ల వ్యవస్థను దెబ్బ కొట్టాలనే లక్ష్యంతో చంద్రబాబు తన అనుకూల వర్గంతో ఎన్నికల కమిషన్ తలుపు తట్టారు. సామాజిక పింఛన్ల పంపిణీకి వలంటీర్లను వినియోగించ కూడదంటూ ఎన్నికల కమిషన్ వారిని పక్కన పెట్టింది. కానీ టీడీపీ కూటమి వలంటీర్లపై కోపంతో చేసిన కుట్రలతో ఇప్పుడు అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు ... ఇలా 13 వర్గాల పింఛన్‌దారులకు శాపంలా మారింది.

టీడీపీ కూటమి వెన్నులో వణుకు..

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువు కావడం, నేరుగా ఇంటి ముంగిటికే అందించేలా వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు కావటం, ఐదేళ్ల పాటు హాయిగా రూపాయి ఖర్చు లేకుండా సేవలు అందుకోవడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. ఇదే విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు భయం పట్టుకుంది. టీడీపీ హయాంలో చంద్రబాబు చేయలేని సంక్షేమాన్ని ప్రజలకు రుచి చూపించటం, వలంటీర్ అనే ప్రజా సేవకుని ద్వారా నేరుగా లబ్ధి చేకూరటాన్ని ప్రతిపక్ష పార్టీలు జీర్ణించుకోలేక పోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే తమ అడ్రస్ గల్లంతు కాక తప్పదనే భయంతో వారి వెన్నులో వణుకు పుట్టిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రతి విషయంలో వలంటీర్ల నిస్వార్థంగా అందిస్తున్న సేవల పట్ల చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిన్న చూపు చూస్తూ అవమానకరంగా మాట్లాడుతుండటంతో మనస్థాపానికి గురైన వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో సత్తెనపల్లి పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలోని 25,26 వార్డులకు చెందిన 16 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేయడం గమనార్హం.

మజ్జిగ పంపిణీ

పెదకూరపాడు: మండల కేంద్రంలో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో గుడిపూడి కాంతరావు జ్ఞాపకార్థంగా బాటసారులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. గుడిపూడి బ్రదర్స్ ఆదిశేఖర్, సాగర్‌బాబు మాట్లాడుతూ.. వ్యవసాయకూలీలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో మజ్జిగ చలివేంద్ర ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జన చైతన్య సమితి కో-ఆర్డినేటర్ తుళ్ళూరు సాంబశివరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు బెన్నిబాబు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.